క్లుప్తంగా

మాచర్లలో వర్షం



మాచర్ల: పట్టణంలో బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. దాదాపు అర్ధగంట సేపు వాన పడింది. ఫలితంగా పట్టణంలోని పలు వీధులు జలమయమయ్యాయి.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మాచర్ల: గుడ్ మార్నింగ్ మాచర్ల కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు బుధవారం పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆయా వార్డు కౌన్సిలర్లు, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ అంతరాయాలను నియంత్రించాలి



పిడుగురాళ్ల: విద్యుత్ సరఫరాలో అంతరాయాలను పరిష్కరించాలని పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ పరిధిలో తరచూ విద్యుత్ అంతరాయం ఎందుకు కలుగుతుందని ఆరా తీశారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల-2 వీఆర్వోగా నాసర్‌రెడ్డి



రెంటచింతల: రెంటచింతల-2 వీఆర్వోగా పాశం నాసర్‌రెడ్డిని నియమిస్తూ కలెక్టర్ పి. అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దార్ జి.కరుణకుమార్ బుధవారం తెలిపారు. నాసర్‌రెడ్డి రెంటచింతల-2 వీఆర్వోగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు నాసర్ రెడ్డి మండల పరిధిలోని గోలి గ్రామ వీఆర్వోగా విధులు నిర్వహించారు. నాసర్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ వివిధ పనులపై వచ్చే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

అర్ధవీడు తహసీల్దార్ దాసు మృతి



మాచర్ల: అర్ధవీడు తహసీల్దార్‌గా పనిచేస్తున్న కుక్కమూడి దాసు(58) బుధవారం గుండె పోటుతో మరణించారు. ఈయన సొంతూరు మాచర్ల. ఇక్కడే రెవెన్యూశాఖలో ఆయన జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఆర్ఐ, డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లా యర్రగొండ పాలెం తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం అర్ధవీడు తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. ఈయన మాచర్ల పీడబ్ల్యూడీ కాలనీలో నివాసం ఉంటారు. దాసు మృతి విషయం తెలుసుకున్న పలు ప్రముఖులు, విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారులు సంతాపం తెలిపారు.

బోరుగుంత పూడ్చివేతపై ఫిర్యాదు



రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో రైతు ఏర్పాటు చేసుకున్న బోరుగుంతను గుర్తు తెలియని వ్యక్తులు పూడ్చిన ఘటన ఈ నెల 7న జరిగింది. గ్రామానికి చెందిన పోట్ల శ్రీనివాసరావు పుల్లయ్యకుంట సమీపంలో తన పొలంలో 300 అడుగుల లోతులో తవ్వించుకున్న బోరు గుంతను దుండగులు పూర్తిగా పూడ్చి ధ్వంసం చేశారు. దీనివల్ల సుమారు రూ.2.50 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు రెంటచింతల పోలీసు స్టేషన్‌లో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే ఈ బోరు సమీపంలో శ్రీనివాసరావు ఏర్పాటు చేసుకున్న మరో బోరు గుంతను 2024 జూన్ 25న దుండగులు పూడ్చివేసి అక్కడున్న 10 హెచ్‌పీ మోటార్‌ను దొంగిలించుకెళ్లారు. అప్పుడు రూ.4 లక్షల వరకు నష్టపోయినట్లు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యదర్శుల కొరత

- గ్రామాల్లో పాలన అస్తవ్యస్తం
- ఇన్‌చార్జులే దిక్కు
- పారిశుద్ధ్య పనుల నిర్వహణ అధ్వానం

గురజాల : గ్రామాలను పంచాయతీ కార్యదర్శుల కొరత వేధిస్తోంది. ఫలితంగా పాలన పడకేస్తోంది. పారిశుద్ధ్య పనులు అధ్వానంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో ఈ దుస్థితి నెలకొంది. ఒక్కో కార్యదర్శికి రెండు నుంచి మూడు గ్రామ పంచాయతీలు కేటాయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి సరఫరా సవ్యంగా సాగడం లేదు. వీధి లైట్ల నిర్వహణ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పన్నుల విధింపు, వసూళ్లతోపాటు పలు విభాగాల పనితీరు అస్తవ్యస్తంగా మారింది. పలు పంచాయతీల్లో కార్యదర్శులు లేకపోవడంతో ప్రజలు మండల పరిషత్ కార్యాలయానికి వ్యయప్రయాసల కోర్చి రావాల్సి వస్తోంది. చాలా గ్రామాలకు ఇన్‌చార్జిలే ఉండడంతో వారు ఎక్కడ ఉంటారో తెలీక ప్రజలు సతమతమవుతున్నారు.



గంగవరంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

కార్యదర్శుల నియామకం చేపట్టాలి..

కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చింది. అర్హులకు సంక్షేమ ఫలాలు అందాలంటే సమర్థవంతమైన అధికారులు ఉండాలి. గ్రామ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటే సంక్షేమ ఫలాలు సక్రమంగా అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. అధికారులు లేని గ్రామాలకు అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నియోజకవర్గంలో కార్యదర్శులు ఇలా...

మండలం	పంచాయతీలు	కార్యదర్శులు
గురజాల	12	8
దాచేపల్లి	14	14
మాచవరం	15	17
పిడుగురాళ్ల	16	8

సీతారామాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లోని సీతారామాలయం రాజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠను వేద మంత్రాల నడుమ బుధవారం వైభవంగా నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి కల్యాణాన్ని బ్రహ్మారెడ్డి దంపతులు వీక్షించారు. అనంతరం సీ టైపులోని కనకదుర్గ ఆలయంలో ఎమ్మెల్యే విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. సీతారామాలయంలో ఐదు వేల మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు కోలా వసంత కుమార్ రెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, పంగులూరి పుల్లయ్య, బొల్లా వెంకటేశ్వర్లు,గుండాల శ్రీను,మైలపల్లి అప్పలరాజు, సత్తిబాబు, ఆడెపు కోటయ్య, బసివిరెడ్డి, ఎరిపల్లి వెంకటేశ్వర్లు, పరమేశ్వరావు, గంటా ధనుంజయ రావు, నర్సింహులు, వస్తుపూరి శ్రీరామూర్తి, బాబు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

నేటి నుంచి ఏసీఏ అండర్-14 బాలుర క్రికెట్ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: పెదచెరువులోని ఏసీఏ ఎస్‌కెఆర్‌బిఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో ఈనెల 10వ తేది నుంచి ఏసీఏ గ్రూప్ బి అండర్-14బాలు ర క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు బుధవారం తెలిపారు. పోటీలలో శ్రీకాకుళం, అనంతపురం, నెల్లూరు, విజయనగరం, కృష్ణా, గుంటూరు జిల్లాల జట్లు పాల్గొంటాయని వివరించారు.

విద్యార్థులకు రూ.1.50 లక్షల విలువైన మెటీరియల్ పంపిణీ

మాచర్ల: పట్టణానికి చెందిన న్యూటన్స్ కళాశాల అధినేత జున్నా శ్రీనివాసరెడ్డి పద్మావతి దంపతులు, కుమారుడు గౌతమ్‌రెడ్డితో కలిసి దసరా ఉత్సవాల సందర్భంగా బుధవారం రూ.1.50 లక్షల విలువైన విద్యా సామగ్రిని పేద విద్యార్థులకు అందజేశారు. పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీలో శ్రీలలితాంబ ఆలయంతోపాటు, 13వ వార్డులో కనకదుర్గమ్మ దేవాలయం, సొసైటీ కాలనీలోని మాతా అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి, సరస్వతి దేవికి పూజలు చేసిన అనంతరం వారు విద్యార్థులకు మెటీరియల్‌ను అందించారు. అనంతరం పలు దేవాలయాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాతా అన్నపూర్ణేశ్వరిగుడిలో పూజలు చేస్తున్న న్యూటన్స్ కళాశాల అధినేత జున్నా శ్రీనివాసరెడ్డి దంపతులు

నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంకు పరిశీలన

దాచేపల్లి : నగర పంచాయతీ శివారులో నిర్మాణంలో ఉన్న నాయరా పెట్రోల్ బంకును జాయింట్ కలెక్టర్ సూరజ్ బుధవారం పరిశీలించారు. పలు అనుమతుల కోసం బంకు నిర్వాహకులు దరఖాస్తు చేసుకోవడంతో జేసీ పరిశీలనకు వచ్చారు. పలు సూచనలు చేశారు. జేసీ వెంట తహసీల్దార్ వైవీ కుటుంబరావు, ఆర్ఐ శరత్ పాల్గొన్నారు.

కారెంపూడిలో పర్యటన

కారెంపూడి: జేసీ సూరజ్ గనోరే బుధవారం కారెంపూడిలో పర్యటించారు. ముందుగా స్థానిక వినుకొండ వెళ్లే రహదారిలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్ బంక్‌ను తనిఖీచేశారు. అనుమతి పత్రాలను బంక్ నడపడానికి ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించారు అనంతరం కారెంపూడి సాయిబాబా గుడి సమీపంలోని రేషన్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపు రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో కొద్దిసేపు రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



దాచేపల్లిలో బంకును పరిశీలిస్తున్న జేసీ



తంగెడ రోడ్డులో ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి



గుంతలమయంగా ఉన్న దాచేపల్లి-తంగెడ రోడ్డు

అడుగడుగునా నరకం

దాచేపల్లి నుంచి తంగెడ వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డులో అడుగులోతు గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిన ప్రయాణమంటే అడుగడుగునా నరకం కనిపిస్తోంది. భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రాత్రుళ్లు ద్విచక్రవాహనదారులు గుంతల్లో పడి గాయపడుతున్నారు. తంగెడ ఊరిలో ఉన్న ఈ రోడ్డు కోసం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. బ్రిడ్జిపై కూడా గుంతలు ఏర్పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలేశారు. ఇప్పటికైనా కనీసం గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

– దాచేపల్లి

జెడ్పీ ఆస్తుల పరిరక్షణకు కృషి

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

సత్తెనపల్లి: జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామని ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో బుధవారం కట్టమూరి నరసింహం పేరుతో జిల్లా పరిషత్ స్థలంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణతో కలిసి ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలో 2,500 ఎకరాల జిల్లా పరిషత్తు భూములు ఉన్నాయని, వాటిని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సహకారంతో భూముల పరిరక్షణతో పాటు అభివృద్ధి చేస్తామన్నారు. స్వర్గీయ మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు హయాంలో రూ.3 కోట్ల ప్రభుత్వ నిధులతో గెస్ట్‌హౌస్ నిర్మించారని తెలిపారు. కాగా మరో రూ.30 లక్షలు గెస్ట్‌హౌస్‌కు కేటాయించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ కోరగా త్వరగా ప్రతిపాదనలు తయారు చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో పంచాయతీరాజ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ స్థలదాత కట్టమూరి నరసింహం పేరు మీద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయతీ రాజ్ డీఈ శేఖర్‌బాబు, ఎంపీపీ షేక్ ఎలవర్తిపాటి జైబూన్‌బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, మున్సిపల్ మాజీ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, న్యాయవాది పూజల వెంకట కోటయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



పంచాయతీరాజ్ భవన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా

రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాస్‌రెడ్డి



దాచేపల్లి మండలం మాదినపాడులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

పిడుగురాళ్ల రూరల్/గురజాల రూరల్/దాచేపల్లి/మాచవరం: రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. మండలంలోని జానపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. వ్యవసాయ పథకాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. హైబ్రిడ్ వెజిటేబుల్ ప్రొడక్షన్, హర్టికల్చర్ ఏరియా ఎక్స్‌పాన్షన్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఉద్యాన పంటల సాగుకు అందించే ప్రోత్సాహకాల గురించి తెలియజేశారు. అనంతరం తుంపర సేద్యం, డ్రిప్, స్ప్రింకర్ల సేద్యం పరికరాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.

– రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని మంచి దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.సంధ్యారాణీ సూచించారు. గురజాల నగర పంచాయతీ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

– దాచేపల్లి మండలం మాదినపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ డి.పాపకుమారి మాట్లాడుతూ రైతులకు సూచనలు చేశారు. మోతాదుకు మించి ఎరువులు, పురుగుమందులు వాడొద్దని చెప్పారు.

– మాచవరం మండలం మోర్జంపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కె.రామమ్మ మాట్లాడుతూ పత్తి పంటలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గులాబీ పురుగు నివారణకు పక్షి స్థావరాలు, లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాధికారులు మణిదీప్తి, జానీబాషా, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



గురజాలలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి సంధ్యారాణి



మాచవరం మండలం మోర్జంపాడులో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



పిడుగురాళ్లలో వాసవీమాతకు భక్తుల ప్రత్యేక పూజలు అమ్మవారిదేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలో శివలింగాలతో పూజలు



పాలువాయి జంక్షన్‌లో సరస్వతీదేవి అలంకారం



మాచర్ల సొసైటీ కాలనీలోని మాతా అన్నపూర్ణేశ్వరి గుడిలో..



రెంటచింతలలో చౌడేశ్వరి దేవస్థానంలో.





మాచవరంలో సరస్వతీదేవి అలంకారం



పాత మాచర్లలో సరస్వతీదేవిగా వాసవీమాత



పిడుగురాళ్లలో ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి



కారెంపూడి మండలంలో సరస్వతీ దేవి అలంకారం



విజయపురిసౌత్ మత్స్యకారుల కాలనీలోని కనకదుర్గ గుడి వద్ద అన్నదానం

వీణాపాణీ వందనం

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీ దేవిగా దర్శనమించ్చారు. భక్తులను కటాక్షించారు. వీణాపాణీ వందనం అంటూ భక్తులు ప్రణమిల్లారు.

– మాచర్ల/విజయపురిసౌత్/దాచేపల్లి/పిడుగురాళ్ల/రెంటచింతల/మాచవరం/కారెంపూడి

పట్టభద్రులూ.. ఓటు హక్కు నమోదు చేసుకోండి

నరసరావుపేట: వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే గుంటూరు, కృష్ణా జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు 2022నాటికి గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆ నియోజకవర్గ ప్రస్తుత పీడీఎఫ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు కోరారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రైతులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. గత ఆరేళ్లుగా అనేక ఉద్యమాల్లో పాల్గొని పరిష్కరించామన్నారు. నవంబరు ఆరోతేదీ వరకు ఓటర్లుగా నమోదు కావొచ్చన్నారు. యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) కార్యాలయంలో నమోదు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, అందరూ ఈ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారధి మాట్లాడుతూ యూటీఎఫ్ తరఫున ప్రతి మండల కేంద్రంలో పట్టభద్రులు ఓటర్లుగా నమోదుచేసేందుకు ఒక కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. దరఖాస్తులు దాఖలు చేసేందుకు ఆన్‌లైన్, హాఫ్‌లైన్ ద్వారా సహాయం చేస్తుందన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న లక్ష్మణరావుకు యూటీఎఫ్ మద్దతు పలికిందన్నారు. పట్టభద్రులు చైతన్యవంతులై లక్ష్మణరావుకు మద్దతు తెలియచేయాలని కోరారు. ఈసందర్భంగా దరఖాస్తులను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

పోలేరమ్మ అమ్మవారి విగ్రహప్రతిష్టా మహోత్సవం

చిలకలూరిపేట: మండలంలోని కమ్మవారిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పోలేరమ్మ అమ్మవారి దేవాలయంలో పోలేరమ్మ, పోతురాజు, విమాన శిఖరం ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు స్వాగతం పలికారు.

బాల్‌బ్యాడ్మింటన్‌కు శావల్యాపురం విద్యార్థి

శావల్యాపురం: జాతీయస్థాయి బాలికల బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీలకు శావల్యాపురం హైస్కూలు విద్యార్థి ఎంపికైనట్లు పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి బుధవారం తెలిపారు. ఈసందర్భంగా పీడీ మాట్లాడుతూ పాఠశాల్లో ఇంటరు ద్వితీయ సంవత్సరం చదువుతున్న కామినీడి కావ్య ఈనెల 5 నుంచి 7 వరకు విశాఖపట్టణం జిల్లా నునపర్తిలో జరిగిన జూనియర్ బాలికల (అండర్-19) బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఈపోటీల్లో గుంటూరు బాలికల జట్టు నాల్గవ స్థానం సాధించగా ఈపోటీలల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన కావ్యను ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేశారు. అక్టోబరు నెలలో నాగపూర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కామినీడి కావ్య పాల్గొంటుందని పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఈసందర్భంగా మంచి ప్రతిభ చూపిన కావ్యకు స్టార్ ఆఫ్ ఆంధ్ర బెస్ట్ ప్లేయర్ అవార్డును పొందింది. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన క్రీడాకారిణిని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఈ.శివశంకరు, అధ్యక్షులు ఆనంద ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు వై.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, కిరణ్మయి, బాలికల జట్టు మేనేజరు ఝాన్సీ అభినందించారు.

NOTICE

మహారాజశ్రీ 1వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్): గుంటూరు

I.A. No: 650/2015 in O.S.No: 72/2013

పిటీషనర్లు: సీలొట్టి రాధాకృష్ణమూర్తి వగైరా

Vs

రెస్పాండెంట్లు: స్వామి హరిగోపాల్ వగైరా

R4: స్వామి మణిదీప్ S/o హరిగోపాల్

R5: స్వామి భార్గవి సింధు నాగజ్యోతి @ జ్యోతి D/o హరిగోపాల్

R4 & R5 ఇద్దరిదీ ఇంటినెం.12-152, [illegible] బజారు, SVKP టెంపుల్ ఎదురు లైను, జానపాడు రోడ్డు పిడుగురాళ్ళ.

R6: తమ్మనశ్రీవల్లి (ప్రస్తుతం [illegible] వివాహం [illegible] శ్రీవల్లి W/o హరిబాబుగా పిలువబడుచున్నది) రామాలయం వద్ద, వడ్లపల్లి, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా.

పై నెంబరులో శ్రీకోర్టువారు జారీ చేసిన ప్రిలిమినరీ డిక్రీ ప్రకారం ఫైనల్ డిక్రీ ఇప్పించమని పిటీషనర్లు దాఖలు చేసియుండున R4 & R6 లకు నోటీసు నిమిత్తం కోర్టువారు ది.28.10.2024కి వాయిదా వేసినారు. సదరు తేదీన పై రెస్పాండెంట్స్ స్వయంగా లేదా తమ అడ్వకేట్ ద్వారా ఉ.10.30 గం.ల నుండి హాజరులో వుండి తమ అభ్యంతరాలను తెలుపుకొనవలసినది లేనిఎడల వారి పరోక్షమందు కేసు తీర్మానించబడును.

వాయిదా: 28.10.2024

యతిరాజు వెంకటేశ్వర్లు

అడ్వకేట్, గుంటూరు. సెల్: 7981373694